

# అమెరి'కా'లేజ్

## – లిపి మల్లాది



*అమెరికాలో కాలేజీ చదువంటే ఒకప్పుడు గగనకుసుమం, అదో ఇంద్రజాలం. గత రెండు, మూడు దశాబ్దాల్లో అమెరికాలో చదువుకోసం వస్తున్న విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరగడమే కాక, ఇండియాలో కూడా ఒక మాదిరిగా చదువుకున్న కుటుంబాల్లో దాదాపు ప్రతి ఇంటికీ కనీసం ఒకరైనా అమెరికాలో చదువుకుంటున్న పిల్లలుంటున్నారు. ఇంటర్నెట్ అరచేతిలోకొచ్చేసిన ఈ రోజుల్లో అమెరికాలో కాలేజీలు ఎలా ఉంటాయో, అక్కడ డార్మ్స్ ఎలా ఉంటాయి, స్టూడెంట్స్ జీవితాలు ఎలా ఉంటాయో... అనే విశేషాలు అతి సులువుగా తెలిసిపోతున్నట్లనిపిస్తున్నాయి. ఐనా మొదటిసారి చదువుకోసం అమెరికా వచ్చే ప్రతి విద్యార్థికీ ఎవరి అనుభవం వారిదే, ఎవరి ఇబ్బందులు వారివే, ఎవరి స్నేహాలు వారివే. ఈ నేపథ్యంలో అమెరికాలో చదువుకోసం వచ్చిన ఓ సాధారణ మధ్యతరగతి అమ్మాయికి ఎదురైన సంఘటనలు, సన్నివేశాలు.. స్నేహాలు, సంతోషాలు.. సరదాలు.. వెరసి ఇవన్నీ అమెరికాలేజీ కథలు. స్వానుభవాలనూ, విన్న అనుభవాలనూ, చూసిన అనుభవాలనూ – ఆసక్తికరమైన ధారావాహికగా కౌముది పాఠకులకు అందిస్తున్నది లిపి మల్లాది. 'నా కళ్ళతో నాన్న' ధారావాహికతో కౌముది పాఠకుల అభిమానాన్ని సొంతం చేసుకున్న లిపి మల్లాది ఈ ధారావాహికతో మీకు మరింత చేరువౌతుందని ఆశిస్తూ..*

*– సంపాదకుడు*

*(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)*

**లాబ్‌లో** ఉద్యోగానికి ఇవాళ మొదటి రోజు. ఎంతో కుతూహలంగా లేచాను. ఒక నోట్ బుక్ మీద 'లాబ్' అని రెడ్ పెన్ తో పెద్దగా రాసాను. త్వరగా తయారయ్యి గబగబా వెళ్ళాను. నేను వెళ్ళేసరికి అక్కడ ప్రొఫెసర్ లేరు. అయోమయంగా అంతా చూసాను. అభిఇషేక్ కూడాలేదు.

"ఆర్ యు అవని?" ఒక అమ్మాయి అడిగింది.

"యస్" అన్నాను.

"ఐయాం రెయిన్. ప్రొఫెసర్ టోల్డ్ మి అబౌట్ యు" అంది.

"యువర్ నేం ఈజ్ రెయిన్?" అడిగిన మరుక్షణం నాలుక కొరుక్కున్నాను.

"యస్. ఐ యాం ఫ్రం మలేషియా. అండర్ గ్రాడ్" అంది.

"యువర్ నేమ్ ఈజ్ బ్యూటిఫుల్" ఠక్కున అన్నాను.

తను థాంక్స్ చెప్పి మాటలు సాగించింది. తను, వాళ్ళ అన్నయ్య ఆగస్ట్ ఇద్దరూ దాదాపు ఒకేసారి చేరారట. రెండు నిమిషాల తేడాతో తను చెల్లి అయినా, అన్నయ్య మలేషియాని వదిలి వచ్చేందుకు ఇష్టపడకపోయేసరికి ఒక సెమిస్టర్ లేట్‌గా చేరారట. అమెరికాకి వచ్చి చదువుకుంటున్నారంటే ధనవంతుల అయివుంటారు. అందుకే అబ్బాయి స్కూల్ పూర్తయ్యాక కాలేజీలో చేరకపోయినా అమ్మా, నాన్న ఏమీ అని ఉండరు. కానీ నాతో ఎంతో బాగా మాట్లాడింది. ఆగస్ట్‌లో పుట్టినందుకు అన్నయ్య పేరు ఆగస్ట్ అని, ఆరోజు వాన పడినందుకు తన పేరు రెయిన్ అని చెప్పింది. ఎంతో ఆశ్చర్యపోయాను.

భూమి మీద పుట్టినందుకు నా పేరు అవని అని, పేరు భూమి కావడంతో ఆకాశం మీద ఆశక్తి పెరిగిందని చెప్పాను. తను నిజమనుకుందో, లేక జోక్ అర్థంకాలేదో తెలుసుకునే లోపు ప్రొఫెసర్ వచ్చారు. వెంటనే లేచి గుడ్‌మార్నింగ్ చెప్పాను. ఆయన మంచి మూడ్‌లో ఉన్నట్టుగా అనిపించింది. చక్కగా నవ్వుతూ రెయిన్‌ని పరిచయం చేసారు. తను రొబోటిక్ ఫ్లూయిడ్ కంట్రోల్స్ మీద పని చేస్తుందని చెప్పారు. ఇంత తెలివిగలదా అని ఆశ్చర్యపోయాను.

లోపల ఉన్న ఎక్విప్‌మెంట్‌ని చూపించి అవి ఎలా వాడాలో పైపైన చెప్పారు. ముందుగా థీసెస్‌కి టాపిక్ కావాలని, ఆయన తెచ్చిన పేపర్లు, టెక్స్ట్ బుక్స్‌ని చదివి ఎంచుకోమన్నారు. లిటరేచర్ ముందుగా చదివితే థీసిస్ సులభంగా జరుగుతుంది అని కొన్ని టిప్స్ ఇచ్చారు. ఇంతలో లాబ్‌లోకి నెమ్మదిగా జనాలు రావడం మొదలైంది. అందరూ నవ్వుకుంటూ మాట్లడుకుంటున్నారు. వీళ్ళలో నేను కలవగలనా అని ఎంతో భయం, దిగులు కలిగాయి. అక్కడ ఉన్న అందరికీ నన్ను మళ్ళీ పరిచయం చేసి, ఏదైనా సహాయం కావాలంటే వారిలో ఎవరినైనా అడగొచ్చని, సబ్జెక్ట్‌లో ప్రశ్నలు మాత్రం ఆయన్నే అడగమని చెప్పారు. నేను 'సరే ' అన్నట్లుగా తలూపాను.

ఆయన వెళ్ళగానే నేను, రెయిన్ మళ్ళీ మాట్లాడ్డం మొదలు పెట్టాము. ఇదే కలిసిన మొదటిసారైనా తను ఎప్పటినుండో తెలిసిన వ్యక్తిలానే మాట్లాడింది. చిటికెలో ఇద్దరం స్నేహితులయ్యాము. కొద్దిసేపటికి క్లాసుకు టైం అవుతుందని తను వెళ్ళిపోయింది. అక్కడ ఉన్న కంప్యూటర్‌లోకి నా స్టూడెంట్ ఐడితో లాగిన్ అవ్వగలగడం వల్ల నా లాప్‌టాప్ కి పనిలేదని అర్థమైంది. ఆయన ఇచ్చిన పేపర్లు, టెక్స్ట్ బుక్స్ చూస్తూ ఎక్కడ మొదలు పెట్టాలో తెలీక ఆలోచిస్తున్న సమయంలో "ఆర్ యూ ఓకే?" ఎవరో అడిగారు.

"యస్. జస్ట్ థింకింగ్" అన్నాను.

తను నవ్వి "ఐ యాం టిం" పరిచయం చేసుకున్నాడు. చూడ్డానికి ఇండియన్‌లానే ఉన్నాడు.

నా ఆలోచన అర్థమయినట్లు, "ఐ యాం ఫ్రం బాంగ్లాదేశ్" అన్నాడు.

బాంగ్లదేశ్‌లో క్రిస్టియన్లు ఉంటారా అని ఆశ్చర్యపోతుండగా "మై పేరెంట్స్ ఆర్ ఫ్రం ఇండియా" అన్నాడు. దాంతో నేను ఆలోచించడం మానేసి తను ఏం చదువుతాడో అడిగాను. ఇతను కూడా అండర్ గ్రాడ్ అట. ఇక్కడ ఎంతోమంది తెలివిగల వాళ్ళు ఉన్నారు. ఎంతైనా నీల్ ఆర్మ్ స్ట్రాంగ్ చదివిన యూనివర్సిటీకదా! రెయిన్‌తో లా ఇతనితో సంభాషణ కొనసాగలేదు. ముందు పేపర్స్ చదివి ఆ తరవాత టెక్స్ట్ బుక్స్ చదవమన్న సలహా మాత్రం ఇచ్చాడు. ఇతనంత తెలివి నాకు లేదు కాబట్టి, ముందు టెక్స్ట్ బుక్స్ చదివి బేసిక్స్ నేర్చుకోవడం ముఖ్యం అని తీర్మానించాను.

చదువుతుండగా హనీష నుండి ఫోన్ వచ్చింది.

"లంచ్‌కి ఇంటికి వస్తున్నావా?" అడిగింది.

"యా, వస్తాను" అన్నాను.

"నేను దోసలు వెయ్యనా?" అడిగింది.

"యా, వెయ్యి" చెప్పాను.

ఫోన్ పెట్టిన తరువాత ఇంటికి బయలుదేరాను. ఇవాళ క్లాసులు లేవుగానీ మళ్ళీ వచ్చి చదవడం కంటిన్యూ చేద్దామని బాగ్‌ని, బుక్స్‌ని ప్రొఫెసర్ కూర్చోమన్న టేబుల్ దగ్గరే వదిలేసాను.

"ఎలా ఉంది ఫస్ట్‌డే?" హనీష అడిగింది.

"పని ఇంకా స్టార్ట్ అవ్వలేదు. పేపర్స్, బుక్స్ చదివి టాపిక్ డిసయిడ్ అవ్వమన్నారు"

"నైస్. నైస్. ఇప్పుడే ఎంజాయ్ చెయ్యి తరవాత టైం అస్సలుండదు"

తలూపాను.

"లాబ్ మేట్స్ ఎలా ఉన్నారు?"

రెయిన్ గురించి, టిం గురించి చెప్పాను.

ఇక్కడి వాళ్ళు అంతే. పిచ్చి పిచ్చి పేర్లన్నీ పెట్టుకుంటారు. మాక్లాస్‌లో ఒక అమ్మాయి పేరు షికాగో. మన మెవ్వరం ఒంగోలు, నెల్లూరు అని పెట్టుకోము" అంది.

ఇద్దరం నవ్వాము.

"ఆ అమ్మాయి మలేషియన్ అట" చెప్పాను.

"వాళ్ళు కూడా అంతేనేమో. మన ఇండియన్ పేర్లే బెస్ట్ కాస్త మీనింగ్ ఉంటుంది"

"రెయిన్ పేరు నాకు నచ్చింది" చిన్నబోతూ చెప్పాను.

"అయితే నీ పిల్లలకి క్లౌడ్ అని పెట్టుకో."

ఇద్దరం నవ్వాము.

తినడం పూర్తయ్యాక "నేను లాబ్‌కి వెళ్ళి చదువుకుని వస్తాను" అన్నాను.

"మళ్ళీనా?" ఆశ్చర్యపోయింది.

"చాలా ఉంది చదవడానికి" బదులిచ్చాను.

"నేనూ వస్తా" అంది.

తనని నాతో తీసుకెళ్ళొచ్చో లేదో? ప్రొఫెసర్‌కి తెలిస్తే కోప్పడతారేమో. కానీ తనకి వద్దు అని ఎలా చెప్పాలి? మొహమాటం కొద్దీ "సరే" అన్నాను.

ఇద్దరం కలిసి బయటికి నడవగానే "నీకు బోర్ కొడుతుందేమో" అన్నాను.

"ఫర్వాలేదు, కొంచెంసేపు వుండి వెళ్ళిపోతా. రమ్య క్లాస్ అయ్యేంత వరకు ఉంటా" అంది.

ఆలస్యం చెయ్యడానికి " బిల్డింగ్ ఏంటి? ఆ బిల్డింగ్ ఏంటి?" అంటూ చాలా ప్రశ్నలు అడిగాను. ఇంతలో ఓ కారు మా ముందు ఆగింది.

"మీ ఇంటికే వస్తున్నాను" కారులో అబ్బాయి అన్నాడు.

"ఎందుకు?" హనీష అడిగింది.

"నాకు లైసెన్స్ వచ్చింది. లైసెన్స్ వస్తే పార్టీ అడిగావు కదా!"

"ఇప్పుడా? నేను లాబ్‌కి వెళుతున్నాను" బదులిచ్చింది.

"దేనికి?"

"చదవాలి"

"అబ్బో. ఫస్ట్ వీక్‌లోనే చదువా?"

"ఔను. నాకు 'ఏ' కావాలి."

"జోకా సీరియస్సా?"

"సీరియస్‌గానే. చదువుకోవాలి."

"నాకు ఫర్లేదు. నువ్వు వెళ్ళు" అన్నాను.

"వీడు జిడ్డు కేస్" చెవిలో చెప్పింది.

"ఇద్దరూ రండి" అన్నాడు.

ఇదే దొరికిన ఛాన్స్ అని "రమ్య క్లాస్ అయ్యేలోపు వచ్చెయ్యాలి" అన్నాను.

అందుకు హనీష కూడా ఒప్పుకోవడంతో కలిసి బాస్కిన్ రాబిన్స్‌కి వెళ్ళి ఐస్‌క్రీం తిన్నాం. ఆ తరువాత నన్ను లాబ్ దగ్గర డ్రాప్ చేసి వెళ్ళిపోయారు. లాబ్‌లోపలికి వెళ్ళి టెక్స్ట్ బుక్ తెరిచాక ఒక్క విషయం అర్థమైంది. ఆ అబ్బాయి ఎవరో

నాకు తెలీదు, పరిచయం కూడా చెయ్యలేదు కానీ అతను కొన్న ఐస్‌క్రీం మాత్రం తిన్నాను. రెండు, రమ్య ఎవరు? తన క్లాస్ ఎప్పుడవుతుందో నాకు తెలీదు. దాంతో నాలో నేను నవ్వుకున్నాను.

(కొనసాగింపు వచ్చే నెలలో)

Click here to share your comments on this story